# ఆనందం

రాజారాం యేం చెయ్యాలో నిర్ధారించుకున్నాడు. అతను అంతపని చేశాక యెందుకు చేశాడో తేల్చుకోడానికి అతను విడిచిపెట్టిన ఆధారం అతను జేబులో నున్న డైరీయే!.

ఎప్పుడో ఆ డైరీ విప్పేబదులు యిప్పుడే ఒకసారి విప్పి చదివితే మనకు అతను బి.ఏ. పాసైయ్యాడని, సరియైన ఉద్యోగం లేక బాధపడుతున్నాడని తెలుస్తుంది. ఒక పేజీలో మనకు కనిపించేది: "ఇంత అందమైన యిల్లు, అంత చక్కని భార్య, యీ పసిడి పలుకుల ముద్దులొలికే పాపలు, యీ ఉద్యోగం, యీ హోదా – నాదీ అనుకోవడంలో వున్న ఆనందం యింకెందులో వుంటుంది? నా వూహాలే నిజమైతే యింకేంకావాలి?" అతను ఆపిలు పండుకోసం తోటలోనికి వెళ్తే అరటిపండు అగపడిందనీ, సముద్రంలో ఈతనేర్చుకొని చెరువు దగ్గరకు వెళ్తే తాగేనీళ్లే కరువయ్యాయనీ, హాయిగా నిద్దర పోదామంటే పాడుకలలే కన్నాడనీ వగైరా వగైరా విషయాలెన్నో తెలుస్తాయ్. సుఖపడటానికి నలుగురూ కోరుతున్నవే తానూ కోరుకొన్నాడనీ, ఆ కోరికలు తీర్చుకోడానికి తను దొడ్డిదారిగుండా పోడానికి యిష్టపడకపోవటం వలన నెగ్గుకు రాలేకపోయాడనీ, లోకం అతని వేపుచూసి వూరకనే పళ్లిగిలించిందనీ, అసమర్థుడని వేలెత్తి చూపించిందని మనకు తట్టుంది. అతను యిచ్చిన కొన్ని అభిప్రాయాలివి –

వేషం భేషజం లేనివాళ్లకు, విప్పటం కప్పటం తెలియనివాళ్ళకు, కల్లిబొల్లి కబుర్లు చెప్పలేనివాళ్ళకు, యెదుటివాళ్ళకు పంగనామాలు పెట్టలేనివాళ్ళకు యీ లోకంలో చోటులేదు. నూటికి తొంభైతొమ్మిదిమంది తెలిసే తప్పుచేస్తారు. మేలుకునే వున్నవారిని లేపడం యెవరి తరం? కొన్ని సమయాల్లో కాస్త ఫిలాసఫీ కూడా చెప్పాడని ఒక పేజీలో కనిపిస్తుంది. – "నిన్న పూసిన పువ్వు నేడు వాడిపోతుంది. నిన్న వున్నవారు నేడు లేరు. నిన్నటి నిజం నేడు అబద్ధం. ఈ రోజు అప్పుకు పోతే నిన్నటి పాత అప్పు మీద పడ్తుంది. జీవితం అంటే యింతే – ముమ్మాటికీ యింతే"– జీవితం అంటే విసిగి. వేసారిన యీయన డైరీ మూసి అసలు విషయానికి వద్దాం.

ఆ వేళ సెప్టెంబర్ నెలాఖరురోజు. ఉదయం వర్షం కురిసింది. మధ్యాన్నపు వెలుగు వేడికి మేఘాలు వెలిసిపోయాయ్. కదులుతున్న రైలు శబ్దం బదులు

రాజారాం ఆలోచనలు కదలి చేసిన శబ్దం అతనికి వినిపిస్తోంది. ఒక మూలసీటులో కూర్చొని కిటికీ గుండా తలవంచి చూస్తున్నాడు. కంటికి కంకరరాళ్లే అగపడ్తున్నాయ్. అగుపించని రైలు చక్రాలు కోరలు చాచిన యమ కింకరుల్లా అరుస్తున్నాయ్. రైలు నడవగా దద్దరిల్లిన రైలు పట్టాల్లా అతని మెడమీద నరాలు అదరి పడ్తున్నాయ్.

"ఏదీ మనది కాదు, ఛీ! యీ పాడు లోకంలో యెందుకు బ్రతకాలి?"

రైలు గట్టిగా ఈల వేసింది. అదరిపడి తల యెత్తాడు. ఎదరగా నెమ్మదైన నీటి కెరటాలతో విరామమెరుగని నాట్యం చేస్తున్న చిలక సరస్సు అగపడింది. ఆ దృశ్యం ఒక్కసారి నూతి లాంటి లోతు హృదయాన్ని విశాలమైన సరస్సులా మార్చేసింది. అందానందాలతో అమృతం తాగుతున్న ఆ రమణీయ దృశ్యం ఆశలను మొలకెత్తించి, ఆలోచనలను ప్రేరేపించింది. చీకటి గుండెలోనికి వెలుగు, బీటలు దేరిన మనస్సుపై వర్షపు జల్లు పడినట్లయింది. సరస్సును అంటిపెట్టుకున్న కొండలు నీటిలో మునిగి మధ్యలో తేలినట్లు లంకలున్నాయ్. ఒక లంకపై ఒక వుద్యాన వనం నిర్మించి మధ్యలో ఒక భవంతి నిర్మిస్తే – అందులో వెన్నెల రాత్రుళ్ళు నివసిస్తే యెంత హాయిగా వుంటుంది! తెరచాపలు రెపరెపలాడుతూ నీటిపై కదలుతుంటే తెల్లని కొంగలు గాలిలో తేలిపోతున్నాయ్! తెల్లని మబ్బులు ముక్కలు చెక్కలై ఒకదాని నొకటి వెంట తరముతున్నాయ్.

అతని యౌవ్వనం ముదిమి కోటును విడిచిపెట్టింది. అతని ఆలోచనల వెలుగునకు కప్పిన మబ్బులు విడిపోయినవి. ప్రకృతి పచ్చదనం, నీలినీరు, అతని జబ్బుపడిన ఆలోచనలకు మందై కుదిర్చింది. చేపల తట్ట నెత్తిన పెట్టుకొని ఒక పడుచు పరుగులెత్తుతోంది. ఆమె నిండు యౌవనం నగ్న ప్రకృతిలా కనిపిస్తుంటే రైలు ఆగితే యెంతబాగుణ్ణు అనిపించింది.

రైలు శబ్దం యిప్పుడు తనకు వినిపిస్తుంది. దగ్గరనే నున్న తీగెలపై నున్న రెండు గువ్వపిట్టలు యెగిరిపోకుండా ఆడుతున్నాయ్. కలువ మొగ్గలు నీటి తుప్పలను త్రోసుకుంటూ పైకెగసి విడివడుతున్నాయ్. డొంకలోని ముళ్ళ మొక్కలు బొడ్డుమల్లెలా తెగపూసి సింగారించుకున్నాయ్. రంగురంగుల సీతాకోక చిలకలు తుప్పలపై యెగురుతున్నాయ్. రైలు వేగం తగ్గింది. రోడ్డు మరమ్మత్తు చేస్తున్న కూలీల్లో ఒకామె నవ్వుతూ ప్రక్కనున్న యువకుని వేపు చూసింది. పచ్చని చేల మధ్య నుంచి ఒంటిగా ఎవడో కండలు తిరిగిన మనిషి చేత కఱ్ఱ పట్టుకొని పరుగెత్తుతున్నాడు. ఈత చెట్టుపై గూళ్ళు కట్టుకొని పిచ్చుకలు గెంతులేస్తున్నాయ్. తాటాకుల యింటి ద్వారం దగ్గర చీరతో కట్టిన వుయ్యాలలో ఒక పాపడు వుత్సాహంగా వూగుతున్నాడు.

రైలు ఆగింది. స్టేషను చిన్నదే. కడుపు కోసం దూర ప్రాంతానికి వెళ్ళిపోతున్న భర్తను సాగనంపటానికి ఒక పల్లెపడుచు వచ్చింది. వాడూ తనున్న పెట్టెలో యెక్కాడు. తన ప్రక్కనే కూర్చున్నాడు. ఆమె ప్లాట్‌ఫారం మీదనే నిల్చుని కళ్ళు చీరకొంగుతో తుడుచుకుంటోంది. వీడు చామనఛాయగా బలిష్టంగా వున్నాడు. ఆమె నల్లగా పుష్టిగా వుంది. ఆమె కళ్లు త్రిప్పినప్పుడల్లా యేదో ఒక అర్థాన్ని అందిస్తున్నాయ్. పెదాల్లో యిమిడిన సంతోషం శోకంగా మారగానే గాఢమైన నిట్టూర్పులతో గుండె